అమ్ముకోలేరు... ఉంచుకోలేరు

- అయోమయంలో మిర్చి రైతులు
- ఈ ఏడాది కూలి ఖర్చు కూడా రాదంటున్న అన్నదాతలు
- ధరలు పెరుగుతాయన్న ఆశతో కోల్డ్ స్టోరేజీలకు తరలింపు
- ఇప్పటికే నిల్వ ఉన్న గత ఏడాది పంట


కల్లంలో తాలుమిరపకాయలు ఏరుతున్న కూలీలు

అచ్చంపేట: ఈ ఏడాది మిర్చి రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే దిగుబడి గణనీయంగా తగ్గింది, దానితో పాటు ధర కూడా సగానికి సగం తగ్గిపోయింది. గత ఏడాది ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్లు వస్తే, ఈ ఏడాది మిర్చి పంటకు ఎర్రనల్లి సోకి 10 క్వింటాళ్లకు మించి దిగుబడి లేదు. గత ఏడాది నాణ్యమైన పంట క్వింటా రూ.20 వేల నుంచి రూ.25 వేలు ఉంటే ఈ ఏడాది రూ.8 వేల నుంచి రూ.12 వేలకు మించి లేదు. ప్రభుత్వం ఇటీవల క్వింటా మిర్చికి మద్దతు ధర రూ.11,700గా ప్రకటించడం దారుణాతి దారుణం అని రైతులు అంటున్నారు. ఆ ధర కనీసం మిర్చి కోత కూలీ ఖర్చుకు కూడా రాదని చెబుతున్నారు.

+ లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన కొద్దిపాటి పంటను ఎప్పటికైనా ధర వస్తుందన్న నమ్మకంతో కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. మిర్చి పంటకు ఎకరాకు కనీసం రూ.1.50 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అదే కౌలు అయితే మరో రూ.30 వేలు అదనంగా అవుతుంది.

+ అచ్చంపేట మండలంలో 6 వేల హెక్టార్లకు పైగా మిర్చి పంట వేశారు. దాదాపు సగానికి పైగా పంట ఎర్రనల్లి తెగులుకు బలైపోయింది. ఎర్రనల్లి సోకి పంట దిగుబడులు తగ్గిపోయి కాయలు తాలుకాయలుగా తయారవుతున్నాయి.

పండించిన కొద్దిపాటి పంటకు సరైన మద్దతు ధర ప్రకటించడంలో ప్రభుత్వం చేతులెత్తేసింది. ప్రస్తుతమున్న ధరకు అమ్మితే కూలి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కనికరించక పోతే రైతులు రోడ్డున పడే పరిస్థితి ఉందని వాపోతున్నారు. దానికి తోడు నాగార్జున సాగర్ కెనాల్ నుంచి సాగునీరు సకాలంలో వదలని పరిస్థితి. కంటితుడుపుగా వదిలే నీరు చివరి భూములకు చేరకముందే ఆపేస్తున్నారు.

వడ్డీలు రెట్టింపు

ఇలాంటి పరిస్థితులలో రైతు ఏమి చేయాలి, పండిన పంటను అమ్ముదామంటే పెట్టుబడులు అటుంచి కనీసం కోత ఖర్చు కూడా రాదు.. కోల్డ్ స్టోరేజీలలో ఉంచుదామంటే పెరుగుతుందన్న ఆశా లేదు.. బ్యాంకులలో, ఎరువులు, పురుగు మందులు, విత్తన షాపుల్లో చేసిన అప్పులు ఎలా తీర్చాలి.. ఈ విపత్కర పరిస్థితుల నుంచి ఎలా బయటపడాలి అనే మీమాంశలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు రెట్టింపు అవుతున్నాయి. అలా అని అమ్ముకుందామంటే కూలి ఖర్చు కూడా రాని పరిస్థితి.

ఇప్పటికీ కోల్డ్ స్టోరేజీలలోనే

గత ఏడాది పండించిన మిర్చికి రేటు బాగా ఉన్నప్పటికీ రైతులు ఇంకా ఎక్కువ ధర పలుకుందన్న ఆశతో కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేశారు. గత ఏడాది మిర్చి భారీగా ఇతర దేశాలకు ఎగుమతి కావడాన్ని చూసిన రైతులకు ఇంకా ధర ఎక్కువ వస్తుందన్న నమ్మకంతో కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉంచారు. గత ఏడాది రూ.22 వేలు ఉన్న ధర అమాంతం రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పడిపోయింది. గత ఏడాది పంట ఇప్పటికీ కోల్డ్ స్టోరేజీల్లోనే నిల్వ ఉండగా ఈ ఏడాది పండిన పంటకు ధర లేకపోవడంతో రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో కూరుకుపోయారు. రెండు సంవత్సరాల పంటపై పెట్టిన పెట్టుబడులు రాక పోతే రైతులను ఆదుకునేదెవరు.

అర్థం కావడం లేదు



ఆరుగాలం ఇంటిల్లిపాది కష్టపడి పండించిన మిర్చికి నల్లి కుళ్లు సోకి దిగుబడులు పడిపోయాయి. కనీసం మద్దతు ధర అయినా ఉంటుందా అంటే ప్రభుత్వం మరీ ఘోరంగా క్వింటా రూ.11,700 ప్రకటించింది. ఆ ధరకు అమ్మితే కనీసం కూలి కూడా రాని పరిస్థితులున్నాయి. ఇలాంటి పరిస్థితులు ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– పలప్రోలు వెంకటరెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

ప్రభుత్వం కనికరించాలి



రైతుల ప్రభుత్వం అని చెప్పుకునే సీఎం చంద్రబాబు రైతులపై కనికరం చూపాలి. వెంటనే అన్నదాత సుఖీభవ ద్వారా ఇస్తానన్న రూ.20 వేలు ఇవ్వాలి. పండిన కొద్దిపాటి పంటకు కనీస మద్దతు ధర రూ.20 వేలు అయినా ప్రకటించాలి. అప్పుడే లాభాలు రాకపోయినా కనీసం పెట్టుబడులైనా వస్తాయి. లేకుంటే రైతులు రోడ్డున పడటం ఖాయం.

– రేపల్లె చిన్నోడు, రుద్రవరం

12న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



క్రోసూరు: క్రోసూరు గ్రామ శివారు ప్రధాన రహదారిపై శరవేగంగా రూపుదిద్దుకుంటున్న 32 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఈ నెల 12వ తేదీన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాళ్లాయపాలెం శివస్వామి హాజరువుతున్నట్లు తెలిపారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో ప్రతిష్టా మహోత్సవాలు జరుగుతాయని చెప్పారు. భక్తులు అశేషంగా పాల్గొని స్వామి ఆశీస్సులు తీసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కపోతేశ్వరునికి విశేష పూజలు

నకరికల్లు: మండలంలోని చేజర్ల గ్రామంలో వేంచేసి కపోతేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి, స్వామి వారి కల్యాణ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు కొండకావూరి వెంకట్రామయ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాత సేవ, రుద్రహోమం, బలిహరణ, వసంతోసేవ, త్రిశూల తీర్థోత్సవం, అవభ్రుదస్నానం, పూర్ణాహుతి, మంత్రపుష్పం, వాహన సేవ, దొంగల తోపు, నాగవల్లి తదితర పూజాదికాలు నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అమరావతి: 11 కేవీ లైన్‌లో ట్రీ కటింగ్, మరమ్మతుల కారణంగా మండల పరిధిలోని ఐదు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ పి.రవికిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నరుకుళ్ళపాడు, చావపాడు, ఎండ్రాయి, పెద్దమద్దూరు, లేమల్లె గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

సినీ ఫక్కీలో 15 మేకలు అపహరణ

ముప్పాళ్ళ: మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో దొడ్డిలో ఉన్న 15 మేకలను సినీ ఫక్కీలో ఎత్తుకెళ్లిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసులు, బాధితుడు యనమాల ఎడ్వర్డ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన యనమాల ఎడ్వర్డ్ ఇంటి సమీపంలో దొడ్డి ఏర్పాటు చేసుకొని అందులో మేకలు పెంచుకుంటున్నాడు. శనివారం తెల్లవారుజామున కారులో వచ్చిన దుండగులు దొడ్డికి ఉన్న సీసీ కెమెరా వైర్లను కత్తిరించి కొన్ని మేకలను కారులో ఎక్కించుకుంటున్న తరుణంలో వాటి అరుపులు వినిపించే సరికి ఎడ్వర్డ్ తల్లి పెద్దగా కేకలు వేసింది. ఆ కేకలకు వాహనంతో దుండగులు పరారయ్యారు. అప్పటికే కొన్ని మేకలు, వాటి పిల్లలను వాహనంలో ఎక్కించారు. సుమారు 15 మేకలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. వీటి విలువ సుమారు రూ.లక్షన్నర వరకు ఉంటుందని తెలిపాడు. ఈ ఘటనపై అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళా చట్టాలపై విద్యార్థినులకు అవగాహన



నకరికల్లు: మహిళా చట్టాలపై బాలికలు విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ చల్లా సురేష్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు మహిళా చట్టాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు రూపొందిచబడ్డాయని అన్నారు. విద్యార్థినులు సమస్యలను ఎదుర్కొంటే నేరుగా సమాచారమిచ్చి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



చిలకలూరిపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై మహిళా బృందం సభ్యులు కోరారు. చెన్నై రోటరీ క్లబ్‌కు చెందిన శరవన్ సెల్వి మురుగన్, శివబాల రాజేంద్రన్, సుచిత్ర కోతంగి సభ్యుల బృందం దేశంలోని వివిధ ప్రాంతాలలో తిరిగి పర్యావరణంపై ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం చిలకలూరిపేటను రోటరీ క్లబ్ సభ్యులతో కలిసి పర్యటించారు. అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు ఆళ్ల వేమనరెడ్డి, మాజీ అధ్యక్షుడు కాపు వెంకటరావు, తోటకూర వెంకటనారాయణ, సభ్యులు కొల్లా శివప్రసాద్, కరణం వెంకటశివ, ధూళిపాళ్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొండవీడు ఈఎన్‌టీలో ఉచిత వినికిడి పరీక్షల శిబిరం



నరసరావుపేట: ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా కొండవీడు ఈఎన్‌టి హాస్పిటల్‌లో సోమవారం ఉచిత వినికిడి పరీక్షలు శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధినేత, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హాస్పిటల్ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల వయస్సు గల పిల్లలు, 60ఏళ్ల వయసు దాటిన వారందరికీ కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్‌లో ఉచితంగా వినికిడి పరీక్షలు నిర్వహించి, సమస్యలు ఉన్నవారికి హియరింగ్ ఎయిడ్స్ 30 శాతం రాయితీతో అందిస్తామని పేరఒకన్నారు. మూడేళ్ల లోపు పిల్లలకు వినికిడి సమస్య ఉంటే తమ హాస్పిటల్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ ద్వారా కాంక్లియర్ ఇంప్లాంట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీ వర్షిణి పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశి కుమార్


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశికుమార్

సత్తెనపల్లి: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరు శశి కుమార్ అన్నారు. సత్తెనపల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. ఆ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. పలు సూచనలు చేశారు. పార్టీ నేతలు తమ్మ వెంగళరెడ్డి, కట్టా శంకర్రావులు మాట్లాడారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కందకట్ల శంకర్రావు, మండల పార్టీ అధ్యక్షుడు గంటా విజయ భాస్కర్ రెడ్డి, ముప్పాళ్ళ మండల పార్టీ అధ్యక్షుడు ఆచార్య తులసీరామ్, రాజుపాలెం, నకరికల్లు మండల పార్టీ అధ్యక్షులు డి.సంజీవరావు, మున్వర్ బాజీ, నాయకులు పెరుమళ్ల విశ్వేశ్వరరావు, రామాంజి నాయక్, చందోలు మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.

పదవ తరగతి విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ


విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న శిశు సంక్షేమ సాధికారత అధికారి అరుణ

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారత అధికారి ఆర్.అరుణ పరీక్ష సామగ్రిని అందించారు. పరీక్షల సమయంలో తగినంత సమయం నిద్రకు కేటాయిస్తూ, ఒత్తిడికి లోను కాకుండా ప్రణాళిక ప్రకారం చదువుకోవాలన్నారు. ముందుగా నైటింగేల్ ఆఫ్ ఇండియా స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీనాయుడు వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ నరసరావుపేటకు చెందిన డాక్యుమెంట్ రైటర్ కుంచాల సురేష్ ఆర్థిక సహాయంతో పరీక్ష సామగ్రిని అందించటం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ యూత్ కో ఆర్డినేటర్ మురళి, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ నిరాశ పరిచింది

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు


మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు

వినుకొండ : స్థానిక ఏనుగుపాలెం రోడ్డులోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బడ్జెట్‌పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగాన్ని, సేవా రంగాన్ని పూర్తిగా విస్మరించారని, రాష్ట్రంలో పెండింగ్‌లో ప్రాజెక్టు గురించి ప్రస్తావన లేదని అన్నారు. పల్నాడు జిల్లాలో వినుకొండ ఎమ్మెల్యే, మాచర్ల ఎమ్మెల్యే ఉండి కూడా వరికపూడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఉచిత బస్సు, మహిళలకు ఇస్తామన్న నెలకు రూ.1500 అంశాలను బడ్జెట్‌లో ఎక్కడా ప్రకటించలేదని, బడ్జెట్ నిరాశ పరిచిందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బోయపాటి రామాంజనేయులు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మోహన్‌చంద్, మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, ఏఐసీసీ భాస్కర్, దుర్గాప్రసాద్, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, మాలమహానాడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా


గండిగనుమల సచివాలయ పరిధిలో ట్యాంకర్ల నుంచి నీరు పట్టుకుంటున్న ప్రజలు

బొల్లాపల్లి : నీటి సమస్య ఉన్న గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేస్తున్నామని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ ఎం.ఆకాష్‌నాయక్ తెలిపారు. గత నెలలో నీటి సరఫరా విభాగం ఉన్నతాధికారులు, ఇన్‌చార్జి ఎంపీడీవో, ఆయా శాఖల సిబ్బంది మండలంలో నీటి సమస్య ఉన్న గ్రామాలను పర్యటించి నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి అంచనా వేసినట్టు వివరించారు. వారి ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో గత పది రోజుల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. గండిగనుమల సచివాలయం పరిధిలోని గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నామన్నారు. గండిగనుమలలో 6, దోమలగుండం 3, తండా 3, షోలాయపాలెం 3 ట్యాంకర్ల ద్వారా ప్రస్తుతం నీటి సరఫరా అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో నీటి కొరత తీరుస్తున్నామని, ఉన్నతాధికారులు తదుపరి ఆదేశాలతో పూర్తిస్థాయి నిధులు సర్దుబాటు కాగానే త్వరలోనే ట్యాంకర్ల సంఖ్యను పెంచి మరిన్ని ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా జరుగుతుందని ఏఈ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్


రొంపిచర్ల: మాచవరం గ్రామంలో ఆదివారం కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం విరిగిపోయి తీగలపై ఆధారపడి ఉంది. ఆ సమయంలో ట్రాక్టర్ ట్రాలీలో 30 మంది వరకు కూలీలు ఉన్నారు. విద్యుత్ వైర్లు తెగిపోకపోవటంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. విద్యుత్ సరఫరా కూడా స్తంభించింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

గంజాయి మత్తులో యువత వీరంగం



సత్తెనపల్లి: గంజాయి మత్తులో యువత వీరంగం సృష్టించగా ఒకరికి గాయాలైన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శనివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నాగర్జుననగర్ 6వ వార్డుకు చెందిన తమ్మిశెట్టి ఆంజనేయులు అలియాస్ అంజయ్య వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం సాయంత్రం సుమారు 5–6 గంటల సమయంలో దగ్గరలో ఉన్న దుకాణంలో కిరాణా సరుకులు తీసుకొని తిరిగి వస్తూ ఉండగా స్థానిక యువకులు మద్యం, గంజాయి మత్తులో అంజయ్య వద్ద ఉన్న డబ్బులు ఇవ్వమని అడగగా అతను తిరస్కరించాడు. దీంతో ముగ్గురు యువకులు వారి వద్ద ఉన్న కత్తులతో అంజయ్యపై దాడి చేశారు. బాధితుడిని స్థానికులు హుటాహుటిన సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు.

అమీన్‌సాహెబ్‌పాలెం ప్రభకు గ్రామోత్సవం



నాదెండ్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లి తిరిగి గ్రామానికి చేరుకున్న అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ ప్రభకు శనివారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఊరేగింపు ఆదివారం తెల్లవారుజాము వరకు జరిగింది. ఇదిలా ఉంటే ఈ నెల 3న సోమవారం అప్పాపురం గ్రామ ప్రభకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: రైల్వేస్టేషన్ సమీపంలోని రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమంలో ఆదివారం వాసవీ క్లబ్ అన్నపూర్ణ ఇస్సప్పాలెం ఆధ్వర్యంలో వృద్ధులకు 12 రకాల ఆర్గానిక్ పండ్లు పంపిణీ చేశారు. వేసవి కాలం దృష్ట్యా ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు బొప్పాయి, పుచ్చకాయ, కిస్మిస్, ద్రాక్ష, ఖర్జూరం వంటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ ఉపాధ్యక్షుడు కనమర్లపూడి శ్రీనివాసరావు, క్లబ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పొట్టి వెంకటేశ్వరరావు, అనిల్, మునగాల శ్రీనివాసరావు, వెల్లంపల్లి కేశవరావు, చేగు వెంకటేశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధి పూనూరి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం



శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు త్రిపురపురం డీసీ చైర్మన్ గంగినేని రాఘవరావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఆసక్తితో చదివినప్పుడే మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. విద్యార్థులకు అవసరమైన పరీక్షా సామాగ్రి అందజేశారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముండ్రు హనుమంతరావు,ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు,హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్,ఎస్ఎంసి చైర్మన్ రామాంజమ్మ, ఉపాధ్యాయులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వేసవిలో లోతు దుక్కులే శ్రేష్టం


ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న దృశ్యం

అమరావతి: భూమిని లోతుగా దున్నుకుంటే వర్షపు నీరు లోపలికి బాగా ఇంకి, పైర్ల వేర్లు భూమిలోకి చొచ్చుకుపోయి ఎక్కువ పోషకాలను గ్రహించే అవకాశం ఉందని మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తేలిక నేలల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండడం వల్ల తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండదన్నారు. అందుకని పశువులు, జీవాల ఎరువు, పంటల వ్యర్థాలు వంటివి వాడటం వల్ల భూమి గుల్లబారి తేమ, పోషక పదార్థాలను పట్టి ఉంచే శక్తి పెరుగుతుందన్నారు. వేసవి దుక్కి తరువాత నీటి వసతి ఉన్న ప్రాంతాలలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే భూసారం పెరుగుతుందని తెలిపారు. భూములలో వాలుకు అడ్డంగా దున్నటం వల్ల కోతను నివారించటమే కాక భూమి భౌతిక లక్షణాలు మెరుగుపడతాయన్నారు. లోతు దుక్కుల వల్ల కలుపు మొక్కలు వేర్లతో సహా పెకిలించబడి మట్టితో కలిసిపోతాయని, కలుపు విత్తనాలు భూమిలోనే అధిక ఉష్ణోగ్రతకు నశిస్తాయని తెలిపారు. వేసవి దుక్కుల వలన శనగపచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు, ఎర్రగొంగళి పురుగు, వేరు పురుగు వంటి వాటిని చాలా వరకు తగ్గించవచ్చన్నారు. లోతుగా దున్నినప్పుడు పై భాగాన ఏర్పడిన గట్టి పొరలు విడిపోయి నేల గుల్లబారి గాలిశాతం పెరగటం వల్ల సూక్ష్మ జీవుల సంఖ్య వృద్ధి చెంది సేంద్రియ పదార్థం త్వరగా కుళ్లటానికి తోడ్పడతాయన్నారు.

త్వరలో వినుకొండలో మహాయాగం


సమావేశంలో మాట్లాడుతున్న హిమాలయ గురువు

వినుకొండ: లోక కల్యాణార్థం వినుకొండలో చేపట్టిన మహాయాగాన్ని జయప్రదం చేయాలని హిమాలయ గురువు పిలుపునిచ్చారు. మండలంలోని విఠంరాజుపల్లి సాయి బృందావనం ఆవరణలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హిమాలయ గురువు మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకొని సాయి బృందావనంలో నిర్వహించిన మహాశివరాత్రి కార్యక్రమాలను దిగ్విజయం చేసినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వేడుకల ఖర్చులు, పూర్తి లెక్కలను సమావేశంలో వెల్లడించారు. ప్రపంచ శాంతిని కోరుతూ లోక కల్యాణార్థం 12 సంవత్సరాల పాటు నిర్వహించ తలపెట్టిన మహాయాగం కార్యక్రమాన్ని జయప్రదం చేసే దిశగా అందరి సహాయసహకారాలు కావాలని, ఇప్పటికే అన్ని రంగాల వారితో చర్చలు జరుపుతున్నామని, చర్చల అనంతరం మరోసారి సమావేశం నిర్వహించి యాగం పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు. అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శివశక్తి ఫౌండేషన్ మేనేజర్ జీవీ రమణ, శాంతి ఆశ్రమ ట్రస్ట్ నిర్వాహకులు పెండేల వెంకట మోహన్‌రావు, కె.అనంతకోటేశ్వరరావు, పెండేల కాశీ, కొప్పురావూరి సుధాకర్, పెండేల పుల్లారావు, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4న ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల


స్వామి మూలవిరాట్


ప్రసన్నాంజనేయస్వామి ఆలయం

ఈపూరు (శావల్యాపురం) : బొగ్గరం గ్రామంలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల ఈనెల 4న గ్రామస్తులు నిర్వహించనున్నారు. ఏటా శివ రాత్రి పర్వదినం అనంతరం వచ్చే ఫాల్గుణ శుద్ధ పంచమి నాడు ఈతి రునాళ్ళ నిర్వహించటం ఆనవాయితీ. ఆలయ ప్రాంగణంలో సంతానవేణుగోపాల స్వామి ఆలయం ఉంది. ఇక్కడ ప్రదక్షిణలు చేస్తే సంతానం సిద్ధిస్తుందని భక్తుల నమ్మిక. తిరునాళ్లకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. తిరునాళ్ల కోసం ఇప్పటికే ఆలయ పరిసరాల్లో దుకాణాలు వెలుస్తున్నాయి. నరసరావుపేట డీఎస్పీ పర్యవేక్షణలో వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్ రావు సారధ్యంలో ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరావు బందోబస్తు నిర్వహించనున్నారు.

4న మేడిచెరువు బహిరంగ వేలం

శావల్యాపురం: చినకంచర్ల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న మేడి చెరువులో చేపలు పెంచుకోవటానికి ఈనెల 4న బహిరంగ వేలంపాటను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి చక్రవరపు శ్రీవల్లీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.నరసరావుపేట డివిజన్ పంచాయతీ అధికారి గ్రామస్తుల సమక్షంలో వేలంపాట జరుగుతుందని వెల్లడించారు.